క్లుప్తంగా

రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వానాకాలం ఎరువుల యాజమాన్యంపై రైతులకు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలం పంటలు సాగు చేస్తున్న రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. పంటల సాగులో ఎరువుల వినియోగం వలన కలిగే లాభనష్టాలను తెలియజేశారు. ఏవో రాజుల నాయుడు, ఏఈవోలు శ్రీవిద్య, లావణ్య, శివ, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలను సక్రమంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఇక నుంచి పాఠశాలను సక్రమంగా నిర్వహించాలని నోడల్ అధికారి ఉదయ్‌బాబు, ఎంఈవో మనుకుమార్ సంబంధిత టీచర్లకు సూచించారు. గ్రామస్తుల సమక్షంలో గొడవపడిన ఉపాధ్యాయులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని గ్రామస్తులు క్షమించాలని కోరారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ మరోసారి ఇలా జరిగితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బెజ్జూర్: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 10 గంటలకు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పర్యటించనున్నట్లు బీజేపీ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఏటిగూడ గ్రామంలో భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం

వాంకిడి: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విధులు నిర్వహించి బది లీపై వెళ్తున మేనేజర్ విష్ణువర్ధన్‌ను, నూతనంగా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన జాడి కృష్ణను ఐకేపీ సిబ్బంది మంగళవారం శాలువా లతో సన్మానించారు. మహిళా సంఘాలకు స కాలంలో రుణాలు మంజూరు చేసి సహకరించాలని నూతనంగా వచ్చిన మేనేజర్‌ను కోరా రు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం మహేష్, సీ సీలు, బ్యాంకు సిబ్బంది, వీవోలు పాల్గొన్నారు.

షర్బత్ పంపిణీ

సిర్పూర్(టి): మొహర్రం పండుగ పురస్కరించుకొని మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో స్థానిక ముస్లిం యువకులు షర్బత్ పంపిణీ చేశారు.

బీజేపీలో చేరిన రిటైర్డ్ ఉద్యోగి

కాగజ్‌నగర్‌రూరల్: పెంచికల్‌పేట్ మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి రిటైర్ అయిన షంశీర్ అహ్మద్ మంగళవారం బీజేపీలో చేరారు. పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి షంశీర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెంచికల్‌పేట మండల పార్టీ అధ్యక్షుడు జునగరి మధుకర్, బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి సన్మానం

జైనూర్: కవ్వాల్ టైగర్ జోన్, ఆదివాసీల అభివృద్ధికి ఉద్యమాలు చేసిన ఘనత ఆదివాసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవరావుకే దక్కుతుందని మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన నివాసంలో ఇంద్రవెల్లి మండల నాయకులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

బస్‌పాస్ దరఖాస్తుల స్వీకరణ

దహెగాం: ఆర్టీసీ బస్సులో రాయితీ బస్‌పాస్‌ల కోసం దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్‌పాస్‌ల మేళా నిర్వహించారు. మండలంలోని 70 మంది దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఆర్టీసీ అధికారి దుర్గం తులసీరాం, జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు రవిశంకర్, ఆయా శాఖల అధికారులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బెజ్జూర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆర్ఎంపీలు, పీఎంపీల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ కల్పించడంతో పాటు ధ్రువపత్రాలు కూడా ఇస్తామన్న సీఎం నిర్ణయాన్ని హర్షిస్తూ మంగళవారం మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ యూనియన్ అధ్యక్షుడు ఇబ్రహీం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ హకీం, జావిద్, నరేందర్ గౌడ్, మహేష్, ఆర్ఎంపీ, పీఎంపీలు తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల్లో అంగన్‘బడులు’

- కనిపించని మూత్రశాలలు, మరుగుదొడ్లు
- ఆదర్శకేంద్రాల్లో నిలిచిన విద్యుత్ సరఫరా
- ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలు



సుర్దాపూర్‌లో సంచులతో ఏర్పాటు చేసిన మూత్రశాలలు



మరుగుదొడ్లు, మూత్రశాలలు లేని పార్ద అంగన్‌వాడీ కేంద్రం

కెరమెరి: మహిళా ఉద్యోగులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనికరం చూపడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలకు నోచుకోక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఎంతోమంది అధికారులు జిల్లాకు వచ్చిపోతున్నప్పటికీ ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నా చిత్తశుద్ధి అధికారుల్లో లేకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు.

84 అంగన్‌వాడీ కేంద్రాలు..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో నాలుగు క్లస్టర్లు ఉన్నాయి. వాటిలో కెరమెరి క్లస్టర్‌లో 23, కరంజివాడలో 22, గోయగాంలో 21, మోడిలో 18 కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 15 మినీ, 69 మెయిన్ సెంటర్లు ఉన్నాయి. 0 -6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 2434 మంది ఉండగా, గర్భిణీలు, బాలింతలు 513 మంది ఉన్నారు. మెయిన్ అంగన్‌వాడీ టీచర్లు 61 ఉండగా, మినీలో 14 మంది ఉన్నారు. అద్దెకు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు 32 ఉండగా, ఉచితంగా ఉన్న కేంద్రాలు 15 ఉన్నాయి. మిగిలిన వాటికి ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. కాగా మండలంలో గతేడాది ఆదర్శ కేంద్రాలకు టీవీలు అందించినప్పటికీ విద్యుత్ సరఫరా లేకపోవడంతో చాలాచోట్ల అలంకారప్రాయంగా మారాయి.

84లో రెండింటికే..

మండలంలోని 84 అంగన్‌వాడీ కేంద్రాల్లో కేవలం రెండింటిలోనే మరుగుదొడ్లు ఉన్నాయి. మిగితా వాటిల్లో ఎక్కడా కూడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇటు విద్యార్థులు, గర్భిణీలు, బాలింతలు, అటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కొన్ని గంటలు పని చేస్తుండగా.. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల మాదిరి ఉదయం 9 గంటలకు కేంద్రానికి వచ్చి సాయంకాలం 4 గంటలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలో ఉన్న వారి ఇళ్లకు పరుగెత్తాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలోని అనేక కేంద్రాల్లో వేల రూపాయలు వెచ్చించి ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దినప్పటికీ మరుగుదొడ్లు నిర్మించడంలో మాత్రం అలసత్వం ప్రదర్శించారు. కొన్నేళ్ల నుంచి టాయిలెట్స్ నిర్మించాలని కార్యకర్తలు వేడుకుంటున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. కొన్నిచోట్ల తాత్కాలికంగా సంచులతో మూత్రశాలులు ఏర్పాటు చేయగా, అనేక చోట్ల స్థలం లేదని చెబుతున్నారు.

అధికారులకు నివేదించాం



కొన్నేళ్ల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవు. ఈ విషయాన్ని అనేకసార్లు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు నివేదించాం. వీటి నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరైతే వెంటనే నిర్మాణాలు చేపడుతాం.

– రెబికా, ఐసీడీఎస్ సీడీపీవో, వాంకిడి

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీఐ సతీశ్

ఆసిఫాబాద్‌రూరల్: నేటి యువత నూతన చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ సతీశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా మోసపోతే 193 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మూఢనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమస్య ఉన్న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాందాస్, ఎస్సై రాజేశ్వర్, పోలీస్ సిబ్బంది, కళాబృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలకు విశేష స్పందన



రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉచిత వైదశిబి రాన్ని నిర్వహించారు. కెరమెరి ప్రాథమిక ఆరో గ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 10 మంది విద్యార్థుల రక్తనమూనాలు సేకరించారు. ఇతరులకు పరీక్షలు నిర్వహించి మాత్రలు అందజేశారు. ఆరోగ్య శుభ్రతతో పా టు పరిసరాల పరిశుభ్రత ఎంతో ము ఖ్య మ ని, వేడి అన్నం తింటే మంచిదని పేర్కొన్నారు. వేడి చేసిన నీటిని వడపోసి తాగాలన్నారు. ఏఎ న్ఎంలు సంఘమిత్ర, సుమలత, హెల్త్ అసిస్టెంట్లు వసంత్‌రావు, శంకర్ ఉన్నారు.

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి, మాతా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుర్వేద వైద్యశిబిరానికి సింగరేణి ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజల నుంచి స్పందన లభించింది. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ మహర్షి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతీనెల 16న శిబిరం కొనసాగుతుందని బెల్లంపల్లి ఏరియా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాగజ్‌నగర్‌రూరల్: కొత్తపల్లి వెంకటలక్ష్మి -చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన లభించింది. 20 మంది రోగులు హాజరు కాగా, 11 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు తెలిపారు. లయన్స్ క్లబ్ సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వసి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బోదంపల్లి హెల్త్ సబ్‌సెంటర్ ఇన్‌చార్జి వైద్యురాలు ఫౌజియా సుల్తానా అన్నారు. మంగళవారం కౌటాల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. 37 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పాఠశాల ఎస్‌వో పవిత్ర, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



డ్రైడే నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని ఇందాని గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు వివరించారు. ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. గ్రామంలో డ్రైడే నిర్వహించి టైర్లు, కూలర్లు, టబ్‌లలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, ఎమ్ఎల్‌హెచ్‌పీ సుచరిత, ఏఎన్ఎం కాంత, గంగూబాయ్, కమల పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కెరమెరి: శుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఝరి, మోడి పంచాయతీల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. డ్రమ్ముల్లో, డబ్బాల్లో, వాహనాల టైర్లలో నీరు ఉండకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

‘పెండింగ్ వేతనాలు ఇవ్వండి’



మాట్లాడుతున్న ‘భగీరథ’ కార్మికులు

కెరమెరి: గత నాలుగు నెలల నుంచి వేతనాలు అందడం లేదని, వెంటనే వేతనాలు ఇప్పించాలని మిషన్ భగీరథ కార్మికులు ప్రాజెక్టు మేనేజర్ భానుప్రకాశ్‌ను వేడుకున్నారు. మంగళవారం ధనోరా పంప్‌హౌస్‌లో ఆయనను కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. వేతనాలు లేకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతుందని, పిల్లల ఫీజులు, యూనిఫామ్‌లు, పుస్తకాలకు డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిత్యావసర ధరలు నానాటికీ పెరుగుతుండడంతో ఇస్తున్న వేతనం సరిపోవడం లేదని, ఆ వేతనాన్ని కూడా జాప్యం చేస్తే బతకడం కష్టమవుతుందని పేర్కొన్నారు. కాగా ప్రాజెక్టు మేనేజర్ వేతనాలు ఇచ్చేందుకు సమయం పడుతుందని, ఇష్టం ఉంటే చేయండి.. లేదంటే మానుకోండని పరుషంగా మాట్లాడినట్లు భగీరథ కార్మికులు వాపోయారు. కార్యక్రమంలో బుడ్డయ్య, సోను, ప్రకాశ్, సంతోష్, మహేశ్, చరణ్ తదితరులు ఉన్నారు

‘అమ్మ మాట -అంగన్‌వాడీ బాట’ ర్యాలీ



చింతలమానెపల్లి: బాబాసాగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



బెజ్జూర్: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీలు

బెజ్జూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ మాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు చేపట్టారు. బారెగూడెం గ్రామంలో సూపర్‌వైజర్ కరుణారెడ్డి, టీచర్ డొకే సత్యశ్రీ, ఆయా అంగన్‌వాడీ టీచర్లు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

చింతలమానెపల్లి: పూర్వ ప్రాథమిక విద్య ప్రతీ చిన్నారికి అవసరమని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మంగళవారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. బాబాసాగర్ గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు చిన్నారులకు అవసరమైన ఆటపాటలు నేర్పిస్తారన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల సమాఖ్య సభ్యులు, అంగన్వాడీలు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని ఇట్యాల గ్రామంలో అమ్మ మాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి ఆధ్వర్యంలో గ్రామంలో అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో చిన్నారులు ఉంటే అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో ఆహ్లాదకరమైన బోధన అందిస్తున్నట్లు తెలిపారు.

కెరమెరి: అమ్మ మాట వంటిది అంగన్‌వాడీ బాట అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి, లత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కెరమెరి సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవశ్యకత వివరించారు. చిన్న పిల్లలను ప్రతిరోజు బడులకు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు ఉన్నారు.

జైనూర్: అంగన్‌వాడీ కేంద్రంలోనే పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య నందించేందుకు సిలబస్ సిద్ధమైనట్లు సీడీపీవో ఇందిర అన్నారు. మంగళవారం మండలంలోని జంగాం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి అంగన్వాడీ కేంద్రంలో రోజువారీగా చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

కౌటాల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ‘అమ్మ మాట -అంగన్‌వాడీ బాట’ ర్యాలీ నిర్వహించారు. టీచర్లు ఇంటింటికీ తిరుగుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్య నేర్పడంతో పాటు పౌష్టికాహారం అందిస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, అనిత, విజయ, జీజాబాయి, రమాదేవి, సరోజ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందించనున్నట్లు కాగజ్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ అన్నారు. అమ్మ మాట -అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బారెగూడ, కోసిని, వంజీరి, కోయవాగు, బురదగూడ, కొత్త సారసాల తదితర గ్రామాలతో పాటు పట్టణంలోని పాకీజానగర్‌లో ర్యాలీలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు సరోజినిదేవి, మహేశ్వరి పాల్గొన్నారు.

పోస్టాఫీసులో మందు పార్టీ!



పోస్టాఫీస్ కార్యాలయంలో బీరు సీసాలు

వాంకిడి: పోస్టాఫీసు కార్యాలయ సిబ్బంది ఇటీవల చేసుకున్న మందు పార్టీ తతంగం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితం మండల కేంద్రంలోని పోస్టాఫీసులో కొందరు సిబ్బంది మద్యంతో పార్టీ చేసుకున్నారు. పార్టీ కూడా పనివేళల్లోనే జరిగినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వీడియో ఆలస్యంగా బయటకు వచ్చింది. పార్టీ సమయంలో కొందరు స్థానికులు సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరించి నిలదీయగా వారికి డబ్బు ఆశ చూపి విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డట్లు తెలుస్తోంది. కాగా పోస్టాఫీసు కార్యాలయ సిబ్బందిపై ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నాయి. ఉపాధిహామీ నిధులు చెల్లించడంలో చేతివాటం ప్రదర్శించడం, బ్లాక్‌లో ఉన్న పోస్టల్ అకౌంట్‌లను క్లియర్ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

వర్షం.. రైతుల్లో హర్షం

దహెగాం: వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి భారీ వర్షాలు జాడ లేకపోవడంతో రైతులు వరి సాగుపై ఆందోళన చెందారు. ఈ తరుణంలో మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో వారసంత కావడంతో వర్షపు నీరు అంగడిబజార్‌లో నిలవడంతో చిరు వ్యాపారులు, కొనుగోలు దారులు ఇబ్బందులు పడ్డారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం సుమారు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. పెంచికల్‌పేట్ -సలుగుపల్లి రహదారిలో రోడ్ లెవల్ వంతెనలపై నుంచి వరద నీరు ప్రవహించడంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఏకధాటిగా కురిసిన వర్షానికి వరి పంటను సాగు చేస్తున్న రైతులు ఆనందంలో మునిగిపోయారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎల్లూర్ బొక్కివాగు ప్రాజెక్టులోకి వరద చేరుతుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మవారికి ‘ఆషాఢ’ మొక్కులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయంలో భక్తులు ఆషాఢ మాసం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాదవేణి మల్లేష్ దంపతులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అందరూ మొక్కలు నాటాలి

కౌటాల: ప్రతి ఒక్కరూ నాలుగు మొక్కలు నాటాలని ఈజీఎస్ ఏపీవో పూర్ణిమ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విస్తారంగా మొక్కలు నా టితేనే సంవృద్ధిగా వర్షాలు పడుతాయన్నారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. ఏపీవో మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పీరీలకు పూజలు



పుంజుమేరగూడలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: మొహర్రం వేడుకలు పురస్కరించుకొని గ్రామాల్లో ప్రతిష్ఠించిన పీరీలకు భక్తులు పూజలు చేస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. మంగళవారం 9వ రోజు పెద్ద సరిగెత్తు వేడుకలను నిర్వహించారు. భక్తులు మలీద, షర్బత్‌లను పీరీలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పుంజుమేరగూడ పీరీలను దర్శించుకున్న ఎమ్మెల్యే

మండలంలోని పుంజుమేరగూడలో గల శ్రీ భూవమ్మతల్లీ దేవస్థానాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవారం రాత్రి సందర్శించి పీరీలను దర్శించుకున్నారు. పెద్ద సరిగెత్తు సందర్భంగా మలీదతో పాటు షర్బత్‌లను పీరీలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వామ్మో కొండచిలువ



బెజ్జూర్: మండలంలోని ఏటిగూడ గ్రామ సమీపంలో గల మాణిక దేవర అటవీ ప్రాంతంలో మంగళవారం కొండచిలువ పెద్దచెట్టు ఎక్కుతూ కనిపించింది. మండల కేంద్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పుట్టగొడుగుల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ వారికి కొండచిలువ కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. విషయాన్ని వెంటనే గ్రామస్తులకు తెలియజేశారు.

గుడుంబా పట్టివేత



స్వాధీనం చేసుకున్న గుడుంబా సామగ్రి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన భారతి మండల్ అనే మహిళ ఇంటి వద్ద గుడుంబా తయారు చేస్తుండగా, మంగళవారం ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనపర్చుకున్న 10 లీటర్ల గుడుంబా, తయారీ సామగ్రిని ధ్వంసం చేశారు. ఎస్సై మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేదిలేదన్నారు. సదరు మహిళపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.